క్లుప్తంగా...

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం
- ఎమ్మెల్యే వివేకానంద్



కుత్బుల్లాపూర్: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. బుధవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయానికి వివిధ కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. వాటిని పరిశీలించిన ఎమ్మెల్యే.. సంబంధిత అధికారులకు ఫోన్‌లు చేసి పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. అదే విధంగా పలువురు ఆహ్వాన పత్రాలు అందజేశారు. అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు.

భారతీయ యోగా సంస్థాన్ వ్యవస్థాపకుడికి ఘన నివాళి



జగద్గిరిగుట్ట: జియో, జీవన్ దో అనే నినాదంతో ప్రతి యోగా సాధకుడు ముందుకు వెళ్లాలని యోగా మాస్టర్ దేవేందర్ అన్నారు. శ్రీ సాయి కాలనీ, చింతల్‌లోని యోగా సెంటర్‌లో బుధవారం భారతీయ యోగా సంస్థాన్ వ్యవస్థాపకుడు ప్రకాష్ లాల్ 15వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యోగా మాస్టర్ దేవేందర్, మాస్టర్ ఆనంద్‌హాజరై ప్రకాష్ చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు.

పార్కులో బోర్డు ఏర్పాటు



నిజాంపేట్ : కబ్జాదారుల కబంధహస్తాల నుండి బాచుపల్లి కౌసల్య కాలనీలోని వాటర్ ట్యాంక్, పార్కును కాపాడాలని ఆశాజ్యోతి ఉమెన్ నెట్‌వర్క్ ప్రెసిడెంట్ మల్యాల రమణి జూలై 16న నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై కమిషనర్ సాబేర్ అలీ సానుకూలంగా స్పందించి బుధవారం పార్క్‌లో బోర్డు ఏర్పాటు చేశారు. ఈ స్థలం కౌసల్య పార్క్ స్థలమని, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పేరిట బోర్డును ఏర్పాటు చేశారు. ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించిన కమిషనర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


శివవర్మ(ఫైల్)

కుత్బుల్లాపూర్: అనారోగ్య సమస్యతో బాధపడుతున్న యువకుడు పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా గనపవరం మండలం పిప్పర గ్రామానికి చెందిన సత్యనారాయణరాజు కుమారుడు శివవర్మ(28) తెల్లాపూర్‌లో ఓ ప్రైవేట్ కళాశాలలో నాన్‌టీచింగ్ స్టాఫ్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 29న కళాశాలకు వెళ్తున్నానని చెప్పిన శివవర్మ మలన్న కాలనీలో ఉండే తన స్నేహితుడు ప్రవీణ్ వద్దకు వచ్చాడు. అనారోగ్య సమస్యతో బాధ పడుతున్న అతను సమీపంలోని తోటలో పురుగుల మందు సేవించడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే అతడిని సమీపంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గృహిణి ఆత్మహత్య


రవళి(ఫైల్)

కుత్బుల్లాపూర్: అనారోగ్య సమస్యతో బాధ పడుతున్న ఓ గృహిణి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల వివరాల ప్రకారం.. కామారెడ్డికి చెందిన అనిల్, రవళి(27) ఎం.ఎస్.రెడ్డినగర్‌లో నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. అనారోగ్య సమస్యలతో బాధ పడతున్న రవళి జీవితంపై విరక్తి చెంది బుధవారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అదే సమయంలో ఇంటికి వచ్చిన రవళి చెలెల్లు ఫ్యాన్‌కు వేలాడుతున్న ఆమెను చుట్టు పక్కల వారిసాయంతో కిందకు దింపి 108లో సూరారంలోని మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రవళి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వం ఓ వైపు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించండి అని చెబుతుంది. ప్రభుత్వ విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకుంటుంది. కానీ క్షేత్ర స్థాయిలో పాఠశాలల్లో పూర్తి స్థాయిలో ఉపాధ్యాయుల సంఖ్య, గదుల సంఖ్య, ఇతర వనరులు పూర్తి స్థాయిలో లేకపోవడంతో ప్రభుత్వ లక్ష్య సాధనకు అనేక అవరోధాలు ఎదురతున్నాయి. బాచుపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న విద్యా ప్రమాణాలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు వర్ణనాతీతం. కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులు చెల్లించలేని విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. దీనికి తోడు అన్ని పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం సైతం ఉండటంతో పాఠశాలలకు మంచి డిమాండ్ పెరిగింది. అయితే ఆయా పాఠశాలల్లో పెరుగుతున్న విద్యార్థులకు సంఖ్యకు తగ్గట్టుగా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులకు పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులు న్యాయం చేయలేకపోతున్నారన్న చర్చ జరుగుతుంది.

- నిజాంపేట్

అడ్మిషన్లు ఫుల్.. ఉపాధ్యాయులు అంతంతే!

ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన అడ్మిషన్లు

నూతన అడ్మిషన్లకు నిరాకరణ!

అవకాశం కల్పించాలంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పూర్తి స్థాయిలో లేని ఉపాధ్యాయులు


ప్రగతినగర్‌లో ప్రభుత్వ పాఠశాల

అడ్మిషన్లు ఫుల్

నిజాంపేట్, ప్రగతినగర్, బాచుపల్లి ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో కొత్త విద్యార్థులను చేర్చుకునే పరిస్థితి లేదు. విద్యార్థులు ఫుల్‌గా ఉన్నా ఉపాధ్యాయుల కొరత మాత్రం తీవ్రంగా ఉంది. అడ్మిషన్ల కోసం వచ్చే విద్యార్థులకు సైతం ప్రవేశం కల్పించలేని స్థితిలో పరిస్థితులు నెలకొన్నాయి. అనేక మంది విద్యార్థులు ప్రవేశం కోసం తిరుగుతున్నా ఉపాధ్యాయులు సైతం ఏమీ చేయలేని పరిస్థితి.

హైస్కూళ్లకు ఇబ్బందులు...

ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలకు ఎలాంటి ఇబ్బందులు లేవు. ఉన్నత పాఠశాలల్లోనే ఈ సమస్య ఎక్కువగా ఉంది. నిజాంపేట్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 920 మంది విద్యార్థులు ఉన్నారు.15 సెక్షన్లకు గాను కేవలం 18 మంది ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. దీనికి తోడు ఇక్కడ సరిపడా తగగతి గదులు సైతం లేకపోవడంతో విద్యార్థులకు ఎక్కువగా చేర్చుకునే అవకాశాలే లేకుండా పోయాయి. ఇక ప్రగతినగర్‌లో సుమారు 600 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ కేవలం ఏడుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. ఇక్కడ పూర్తి స్థాయి ప్రధానోపాధ్యాయుడు సైతం లేరు. ఇక్కడ ప్రైవేటు టీచర్లను నియమించుకుని కాలం వెల్లదీస్తున్నారు. ఇక బాచుపల్లి పాఠశాలల్లో 540 మంది విద్యార్థులకు 14 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. పూర్తి స్థాయిలో ఉపాధ్యాయుల నియామకం లేకపోవడంతో నాణ్యమైన విద్యా పేద విద్యార్థులకు ఎలా అందుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

అన్నీ తామై..


ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులను ఆటలు ఆడించేందుకు పీఈటీలు ఉండాలి. కానీ ఇక్కడ ఎక్కడ కూడా పీఈటీలు లేరు. ఇక అటెండర్‌లు ఉండరు. ఆఫీసు సిబ్బంది ఉండరు. పిల్లలకు అన్నీ తామై ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. చదువుతో పాటు శారీరక మానసిక ఉల్లాసానికి క్రీడలు కూడా ఎంతో దోహదం చేస్తాయి. మరి అలాంటి క్రీడల పట్ల ప్రభుత్వ పాఠశాల్లో ఎందుకు చిన్నచూపు కనిపిస్తుందో !. స్కూల్‌లో అనేక కార్యాలయ పనులు ఉంటాయి. కానీ వాటి నిర్వహణకు ఎక్కడ కూడా సిబ్బంది కూడా లేరు. ఈ పనులు అన్నీ ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులు చేసుకుంటున్నారు.

ఉపాధ్యాయుల పాట్లు..

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు సరిపడా టీచర్లు లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు ఉపాధ్యాయులు దాతాల సహకారం కోసం ఎదురుచూస్తున్నారు. వివిధ కంపెనీల ద్వారా, రాజకీయ నాయకుల ద్వారా, కార్పొరేట్ విద్యాసంస్థల ద్వారా సీఎస్ఆర్ ఫండ్స్ తీసుకుని ప్రైవేటు టీచర్లను నియమిస్తున్నారు. కొంత మంది స్పందించి తమ వంతు సహకరిస్తున్నా పూర్తి స్థాయిలో సరిపోయే పరిస్థితిలో ఉపాధ్యాయులు లేరు.

ప్రభుత్వ వాలంటీర్లు లేరు..

గతంలో ప్రభుత్వం టీచర్(ట్రైనింగ్ డీఎడ్, బీఈడీ)పూర్తి చేసిన వారిని విద్యా వాలంటీర్లుగా నియమించి విద్యార్థులకు పాఠాలు చెప్పించేది. కానీ ప్రస్తుతం విద్యా వాలంటీర్ల నియామకం లేకపోవడంతో పేద విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. కనీసం విద్యా వాలంటీర్లను అయిన ప్రభుత్వం నియమించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



అందరికీ అడ్మిషన్ ఇస్తాం

నిజాంపేట్, ప్రగతినగర్ హైస్కూళ్లలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగానే ఉంది. టీచర్లు పూర్తి స్థాయిలో లేకపోవడం వల్ల ఇబ్బంది ఉంది. అయినా చదువుకోడానికి ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ అడ్మిషన్ కచ్చితంగా ఇస్తాం. విద్యార్థులు పెద్ద సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ముందుకు వస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు ఉన్నదే పేద విద్యార్థుల కోసం.

- రామకృష్ణ, ఎంఈఓ, బాచుపల్లి.



అడ్మిషన్ కోసం తిరుగుతున్నాం

ప్రగతినగర్ ప్రభుత్వ స్కూల్‌లో మా కోడలు అడ్మిషన్ కోసం రోజులుగా తిరుగుతున్నాం. ఇప్పటికే స్కూల్‌లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంది. టీచర్లు తక్కువగా ఉన్నారు. నిజాంపేట్‌కు వెళ్లాలని చెప్పారు. అక్కడకు కూడా ఇదే పరిస్థితి ఉంది.

- రాఘవేంద్ర, రాజీవ్ గృహకల్ప



చదువుకోవాలని ఉంది

నాకు చదువుకోవాలని ఉంది. ఇంగ్లిష్ మీడియం ఏడవ తరగతి చదువుతున్నాను. అడ్మిషన్ కోసం వచ్చాం. కానీ ఇక్కడ ఇబ్బందిగా ఉంది అని చెబుతున్నారు. రోజు రోజుకు ఆలస్యమవుతుంది. నిజాంపేట్‌లో ఇప్పటికే 310 మంది విద్యార్థులను జాయిన్ చేసుకున్నాం, ఇక్కడ కూర్చోడానికి కూడా స్థలం లేదంటున్నారు.

- సాయిప్రణీత.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వృక్షార్పణ


ఇంటరాక్ట్ క్లబ్‌లో చేరిన సెయింట్ పీటర్స్ విద్యార్థులు

కుత్బుల్లాపూర్: బంజారాహిల్స్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దూలపల్లిలోని సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్, హైస్కూల్‌లో బుధవారం వృక్షార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో కలిసి రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ ఎస్.వి.రామ్‌ప్రసాద్ తదితరులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఇంటరాక్ట్ క్లబ్ నూతన బోర్డు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ, యువతలో సేవా గుణాలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఇంటరాక్ట్ క్లబ్ ఓ సాధన అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి, పచ్చదనాన్ని పెంచాలని పిలుపునిచ్చారు. 'మై - మై బడ్డీ' అనే తన థీమ్‌ను పరిచయం చేస్తూ, ప్రతి విద్యార్థి ఒక్కొక్క మొక్కను స్వీకరించి పెంచుకోవాలని ప్రోత్సహించారు. కార్యక్రమంలో రోడటరీ క్లబ్ అధ్యక్షురాలు నీరజ, సేవా ప్రాజెక్ట్స్ డైరెక్టర్ దుర్గాప్రసాద్, క్లబ్ అడ్మిన్ టీవీ రెడ్డి, కృష్ణమోహన్, సెయింట్ పీటర్స్ విద్యా సంస్థల యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

ఆల్విన్‌కాలనీ: దోమల నివారణ కోసం ఎంటమాలజీ సిబ్బంది యాంటి లార్వా ఆపరేషన్‌ను బుధవారం చేపట్టారు. ఎంటమాలజీ ఫీల్డ్ అసిస్టెంట్ సూపర్‌వైజర్ నర్సింహులు సిబ్బందితో కలిసి మహాత్మా గాంధీ నగర్‌లో ఇంటింటికీ తిరుగుతూ నీటి నిల్వలు గుర్తించి యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టారు. ఇళ్లలో వృథాగా ఉండే తొట్లలో, టైర్లు, కొబ్బరి బోండాలు, నీటి డబ్బాలలో నీరు ఎక్కువ రోజు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉన్న ప్రదేశాలలో దోమలు వృద్ధి చెంది, దోమ కాటుకు గురి కావాల్సి వస్తుందన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలపై మూతలు ఏర్పాటు చేసుకోవాలని, వాడని నీటిని ఎప్పటికప్పుడు శుభ్రపర్చుకోవాలని సూచించారు.

న్యాయం చేయాలని మృతదేహంతో ధర్నా
- రసాయన డ్రమ్ పేలి ఒకరి మృతి


ఆందోళన చేస్తున్న మృతుని బంధువులు

జీడిమెట్ల: స్క్రాప్ గోదాములో డ్రమ్మును కట్ చేస్తుండగా డ్రమ్ము పేలి కార్మికుడు మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ పరిశ్రమ యజమాని ఇంటి ముందు మృతదేహంతో బంధువులు ఆదోళనకు దిగారు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అలాంముబిన్(35) భార్య తస్లీమున్నిసా, ఇద్దరు కుమార్తెలతో నగరానికి వలస వచ్చి గంపలబస్తీలో ఉంటూ కూలీ పనులు చేస్తూ కుంటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈనెల 28న గంపలబస్తీకి చెందిన ఇంతియాజ్ అనే వ్యక్తి తన స్క్రాప్‌గోదాం వద్ద పని ఉందంటూ అలాంను కూకట్‌పల్లికి తీసుకువెళ్లాడు. అక్కడ రసాయన డ్రమ్ములను కట్ చేయాలని సూచించాడు. అలాం డ్రమ్ములను కట్ చేస్తున్నాడు. రసాయన డ్రమ్ము ఒక్కసారిగా పేలడంతో అలాం తీవ్రగాయాలై మృతి చెందాడు. కేసు నమోదు చేసిన కూకట్‌పల్లి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

న్యాయం చేయాలని ఆందోళన

పోస్టుమార్టం అనంతరం బుధవారం మృతుని బంధువులు అలాం కుటుంబానికి న్యాయం చేయాలని జీడిమెట్ల గంపలబస్తీలోని ఇంతియాజ్ ఇంటిముందు మృదేహంతో ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు కలుగజేసుకుని మృతుని కుటుంబానికి న్యాయం జరిగేలా చేస్తామని హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమనిగింది.

ఐఎఫ్‌బీలో ముగిసిన వర్క్ షాప్


వర్క్‌షాప్‌లో పాల్గొన్న రైతుకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఐఎఫ్‌బీ డైరెక్టర్ వెంకట్ రెడ్డి

సుభాష్‌నగర్: దూలపల్లిలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ బయోడైవర్సిటీ సెంటర్‌లో 'క్వాలిటీ ప్లాంటింగ్ మెటీరియల్ ప్రొడక్షన్ ఇన్ ఫారెస్ట్ నర్సరీ' అనే అంశంపై మూడు రోజులపాటు నిర్వహించిన వర్క్ షాప్ బుధవారంతో ముగిసింది. మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్మెంట్, ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్ (ఎంఓఈఎఫ్‌సీసీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు ఐఎఫ్‌బీ డైరెక్టర్ వెంకట్ రెడ్డి(ఐఎఫ్ఎస్) సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన రైతులు శిక్షణ తరగతుల్లో పాల్గొని అటవీ జాతి మొక్కలపై పూర్తి అవగాహన పెంచుకుంటున్నారన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన రైతులు తాము సొంతంగా నర్సరీలు ఏర్పాటు చేసుకొని నాణ్యమైన అటవీ జాతి మొక్కలను అభివృద్ధి చేసేలా శిక్షణ పొందారన్నారు. కాగితం, ఫర్నిచర్, ప్లైవుడ్ పరిశ్రమలకు కలప అవసరం చాలా ఉందని, ఇందుకోసం అత్యంత వేగంగా పెరిగే కలప జాతులను తాము ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న అవసరాలకు ఐదు శాతం కూడా అడవుల నుంచి కలప అందడం లేదని, కేవలం ఆగ్రో ఫారెస్ట్రీ మాత్రమే ఈ అవసరాన్ని తీర్చగలుగుతుందన్నారు. నేడు హర్యానా, పంజాబ్ వంటి రాష్ట్రాలు కేవలం ఆగ్రో ఫారెస్ట్ ద్వారానే దేశం యొక్క అవసరాలను తీరుస్తున్న విషయాన్ని మన రైతులు గమనించాలన్నారు. తెలంగాణ భూములు అటవీ జాతి మొక్కలకు ఎంతో అనుకూలంగా ఉన్నాయని, రైతులు ముందుకు వస్తే ఇక్కడే కలప ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు అవుతాయన్నారు. ఈ రంగంలో పనిచేస్తున్న సీనియర్ సైంటిస్టులతో తమకు శిక్షణ తరగతులు నిర్వహించడంతో పాటు నర్సరీ నిర్వహణ, అంటు మొక్కల తయారీ, చీడపీడల నివారణ వంటి అంశాలపై అత్యుత్తమ శిక్షణను అందించారన్నారు. తమ వద్ద ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా భోజన వసతులతో పాటు ప్రయాణ చార్జీలు సైతం అందించారని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సైంటిస్టులు డాక్టర్ స్వప్నెందు పట్నాయక్, డాక్టర్ పంకజ్ సింగ్, డాక్టర్ శివ ప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

1న కాంట్రాక్ట్ మెడికల్ ఆఫీసర్లకు కౌన్సెలింగ్

సాక్షి,మేడ్చల్ జిల్లా: కాంట్రాక్ట్ పద్ధతిలో ఎంపికైన మెడికల్ ఆఫీసర్ పోస్టుల తుది ఎంపిక జాబితాను మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఉమాగౌరీ విడుదల చేశారు. జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో ఎంపికైన మెడికల్ ఆఫీసర్లు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థుల జాబితాను జిల్లా కలెక్టర్ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు ఆమె పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు తగిన ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఆగస్టు 1న ఉదయం 11 గంటలకు తూంకుంట పురపాలక సంఘం పరిధిలోని మేడ్చల్ కలెక్టరేట్‌లో ఉన్న డీఎంహెచ్ఓ నిర్వహించ తలపెట్టిన కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని జిల్లా వైద్యారోగ్య అధికారి డాక్టర్ ఉమాగౌరి సూచించారు.


ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి
- ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు అన్నారు. బుధవారం శంభీపూర్‌లోని కార్యాలయానికి నియోజకవర్గ పరిధిలోని వివిధ కాలనీల ప్రజలు ఎమ్మెల్సీని కలిసి సమస్యలపై వినతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల కాలంలో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించామని, బస్తీలు, కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.


ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన సంక్షేమ సంఘ ప్రతినిధులు

శంకరయ్య భవానీ ఎన్‌క్లేవ్‌లో వరదనీటి నాలా పనులు

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ శంకరయ్య భవాని ఎన్‌క్లేవ్, రావినారాయణరెడ్డినగర్ వెస్ట్‌లో కొన్ని సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న వరద సమస్యకు శాశ్వత పరిష్కారం కానుంది. ఒకప్పుడు ఎగువ ప్రాంతమైన ప్రగతి నగర్, మిథిలానగర్ నుంచి చినుకు పడిందంటే వరద నీరు దిగువ ప్రాంతాలైనా మద్దెలకుంట చెరువు, శంకరయ్య భవానీ ఎన్‌క్లేవ్, మాత భూమి నగర్, సంఘమిత్ర వెల్ఫేర్ అసోసియేషన్, శ్రీరామచంద్ర నగర్, కమలమ్మ నగర్ బాలయ్య బస్తీ, మహాదేవపురం మీదుగా పరికి చెరువులో కలిసేది. దీంతో చిన్నపాటి వర్షానికి బస్తీలు, కాలనీలు జలమయం అయ్యేవి. ఇక వర్షాకాలం వచ్చిందంటే అక్కడ జనజీవనం అస్తవ్యస్తంగా మారేది. వరద సమస్యకు చెక్కు పెట్టేందుకు అధికారులు 2 కోట్ల రూపాయల వ్యయంతో 420 మీటర్ల పొడవు, మీటర్ వెడల్పు, మీటరున్నర లోతుతో నాలా నిర్మాణం చేపట్టారు. నాలా నిర్మాణ పనులను బుధవారం ఏఈ కల్యాణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ రెడ్డి పరిశీలించారు. 30 రోజుల్లో నాలా అందుబాటులోకి వస్తుందని తెలిపారు.


నాలా పనులను పరిశీలిస్తున్న ఏఈ కల్యాణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌రెడ్డి

ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయం

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ, అసైన్డ్ భూములను కబ్జాదారుల నుంచి పరిరక్షించేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక వ్యూహంపై దృష్టి సారిస్తోంది. భూ కబ్జాలపై ప్రజావాణితో సహా ఎమ్మెల్యేలు, పలువురి ఫిర్యాదులు అధికార యంత్రాంగానికి అందుతుండటంతో వాటిని కాపాడే బాధ్యత తహసీల్దార్‌దేనని పలు సమీక్షల్లో ఆదేశాలిచ్చిన కలెక్టర్ మనుచౌదరి క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ,అసైన్డ్ భూములపై మండలాల వారీగా ఆరా తీస్తున్నారు. - సాక్షి, మేడ్చల్ జిల్లా

కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి వీఆర్ఓ, వీఆర్ఏలను గ్రామ రెవెన్యూ అధికారులుగా పునః ప్రవేశం చేయించడం ద్వారా ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిరక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో భూముల పరిరక్షణకు పైలెట్ ప్రాజెక్టు కింద సర్వే నిర్వహించి, సాంకేతికంగా కిహోల్ మార్కప్ లాంగ్వేజ్ (కేఎంఎల్) మ్యాప్, (గూగుల్)లో పొందుపరిచే చర్యలను జిల్లా అధికార యంత్రాంగం చేపట్టింది. ప్రభుత్వ, అసైన్డ్ భూములను సంరక్షించే బాధ్యత ఆర్ఐ, డీటీ, తహసీల్దార్‌పైనే ఉందని పేర్కొంటున్న యంత్రాంగం గుర్తించిన ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రహరీ, ఫెన్సింగ్ వంటి రక్షణ చర్యలపై దృష్టి సారిస్తోంది.

కబ్జాదారుల కబంధ హస్తాల్లో..

జిల్లాలోని 11 మండలాల పరిధిలో దాదాపు 269 సర్వే నంబర్లలో 5,195 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు గుర్తించిన రెవెన్యూశాఖ ఇందులో ఎన్ని.. భూములు కబ్జాకు గురయ్యాయి. ఎంత సంరక్షణలో ఉందన్న సమాచారాన్ని మాత్రం చెప్పలేకపోతోంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం.. బాలానగర్ మండలంలో 700 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు తెలుస్తోంది.

- శామీర్‌పేట మండలంలో 420 ఎకరాలు, దుండిగల్ గండిమైసమ్మ మండలంలో 425 ఎకరాలు, మేడిపల్లి మండలంలో 900 ఎకరాలు, ఘట్‌కేసర్ మండలంలో 500 ఎకరాలు, కాప్రా మండలంలో 400 ఎకరాలు, కీసర మండలంలో 417 ఎకరాలు, కుత్బుల్లాపూర్ మండలంలో 600 ఎకరాలు, బాచుపల్లి మండలంలో 360 ఎకరాలు, ఉప్పల్ మండలంలో 333.13 ఎకరాలు, మల్కాజిగిరి మండలంలో 113.06 ఎకరాలు, మేడ్చల్ మండలంలో 37 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు రెవెన్యూ శాఖ రికార్డులు చెబుతున్నాయి.

అసైన్డ్ భూములు ఎక్కువే...

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 2004కు ముందు 116 రెవెన్యూ గ్రామాలు, పలు ప్రాంతాలు, బస్తీల పరిధిలో 8,230 మంది పేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ లబ్ధిదారులకు 11,384 ఎకరాల ప్రభుత్వ భూములను అసైన్డ్ చేశారు. ఈ అసైన్డ్ భూములన్నీ పంటసాగు, ఇళ్ల స్థలాల కోసం పంపిణీ చేశారు.

- ఘట్‌కేసర్ మండలంలోని 17 గ్రామాల్లో 1610 ఎకరాలు, శామీర్‌పేట మండలంలోని 30 గ్రామాల్లో 1451 ఎకరాలు, కీసర మండలంలోని 16 గ్రామాల్లో 1500 ఎకరాలు, మేడ్చల్ మండలంలోని 29 గ్రామాల్లో 4400 ఎకరాలు, ఉప్పల్ మండలంలోని 6 రెవెన్యూ గ్రామాల్లో 286 ఎకరాలు, కుత్బుల్లాపూర్ మండలంలోని 18 గ్రామాల్లో 855 ఎకరాల అసైన్డ్ భూములను అప్పటి ప్రభుత్వం నిర్ణయంతో రెవెన్యూ యంత్రాంగం పంపిణీ చేయగా.. ఇందులో చాలా మేరకు వెంచర్లు, అపార్ట్‌మెంట్లు, ఇండిపెండెంట్ ఇళ్లు, ప్రైవేట్ విద్యాసంస్థలు, ఆసుపత్రులు వెలిశాయి.

కోర్టు కేసుల్లోనూ అధికమే...

మేడ్చల్ జిల్లాలో భూ సంబంధిత కోర్టు కేసులు 706 ఉండగా.. ఇందులో మల్కాజిగిరి రెవెన్యూ డివిజన్ పరిధిలో 349, కీసర డివిజన్‌లో 357 ఉన్నట్లు తెలుస్తోంది. వివిధ కోర్టుల్లో ఉన్న కేసుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సుప్రీంకోర్టులో 1 కేసు ఉండగా.. హైకోర్టులో 481, జిల్లా కోర్టులో 65, లోకాయుక్త కోర్టులో 57, ఎల్‌డీ కోర్టులో 63, సివిల్‌కోర్టులో 6 కేసులు కొనసాగుతున్నాయి. కోర్టు దిక్కారంలో 35 ఉన్నట్లు రెవెన్యూశాఖ రికార్డులు చెబుతున్నాయి.

వివాదంలో చిక్కిన భూములివే..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో భూవివాదాలు అధికంగా ఉన్నాయి. రెవెన్యూశాఖ రికార్డుల ప్రకారం వివాదాస్పద భూములు 12,073.17 ఎకరాలు ఉన్నాయి. ఇందులో సివిల్‌కోర్టు పరిధిలో వివాదంలో ఉన్న భూములు 2,485 ఎకరాలు కాగా.. రెవెన్యూ కోర్టు పరిధిలో 904 ఎకరాలు, ఇతర వివాదాలతో పాటు ఎండోమెంట్, వక్ఫ్, ఫారెస్ట్, వ్యక్తిగత వివాదాల పరిధిలో 2,466 ఎకరాలు ఉన్నట్లు రెవెన్యూ శాఖ పేర్కొంటోంది. అసైన్డ్ భూముల కేటాయింపుల్లోని 1603 ఎకరాల భూములు కూడా వివాదాల్లో ఉన్నట్లు సమాచారం.

- జిల్లాలో 5,837 ఎకరాల వివాదాస్పద భూముల వివరాల లెక్క తేలగా.. మిగతా 6,236 ఎకరాలకు సంబంధించిన వివాదాస్పద భూముల వివరాలను రెవెన్యూశాఖ గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది.

వ్యాధుల నివారణకు కృషి చేయాలి

కూకట్‌పల్లి: సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు కృషి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ అధికారులకు సూచించారు. కేపీహెచ్‌బీకాలనీలో బుధవారం జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్‌తో కలిసి పర్యటించారు. వ్యర్థాల తొలగింపు, దోమల నివారణ స్ప్రే(ఫాగింగ్, యాంటీ లార్వా), పార్కులు, కాలనీల్లో నీరునిలిచే ప్రదేశాల్లో పరిశుభ్రత చర్యలు, ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన తదిర కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్‌ను ఆరోగ్య నగరంగా తీర్చిదిద్దేందుకు వర్షకాల ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కాలనీల్లో, ఇళ్ల చుట్టు చెత్త వేయండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.